క్లుప్తంగా

సమగ్ర విచారణ చేపట్టాలి

దేవరకొండ : సూర్యాపేట మండలం ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో చదువుతున్న విద్యార్థిని వైష్ణవి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం తక్షణమే గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో తగు చర్యలు తీసుకోవాలన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

నల్లగొండటౌన్: సూర్యాపేట మండలం ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దగ్గుబాటి వైష్ణవి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

నేటినుంచి ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

నాగార్జునసాగర్ : నేటి నుండి నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీలోగల వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఉప్పల దత్త ప్రసాదశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రథమాహ్నికము మంగళవారం ద్వితీయాహ్నికములను పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న ధ్వజ జయస్తంభ స్థాపనమూర్తి కుంభజలాభిషేకం, నీరాజనం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

టీఎస్ కళావేదిక సాగర్ ఇన్‌చార్జ్‌గా శ్రీను

త్రిపురారం : తెలంగాణ రాష్ట్ర కళావేదిక నాగార్జునసాగర్ నియోజక వర్గ ఇన్‌చార్జ్‌గా మండలంలోని మాటూర్ గ్రామానికి చెందిన కలకొండ శ్రీను నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సభ్యుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ కలకొండ శ్రీను బాధ్యతలు అప్పగిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన సాగర్ ఇంచార్జీ కలకొండ శ్రీను రాష్ట్ర అధ్యక్షుడితో పాటుగా జిల్లా అధ్యక్షుడు పందిరి సైదులు కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టపర్తి యాత్రలో సత్యసాయి సేవా సంస్థలు



పుట్టపర్తి సత్యసాయి యాత్రలో పాల్గొన్న భక్తులు

నల్లగొండటౌన్: సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లా సత్యసాయి సంస్థల సభ్యులు, భక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి యాత్రలో పాల్గొన్నారు. పుట్టపర్తి పుర వీధుల్లో సాయిబాబా పల్లకి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు డి. శ్రీనివాస్, వెంకట్‌రావు, జె. రత్నాకర్, వంకాయల సుబ్బారావు, సునితా లక్ష్మయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీరేశానికి వినతి

నల్లగొండ: ఆరోగ్యశ్రీ పథకంలో పని చేసే సిబ్బంది ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిసి తమ సమస్యలు విన్నవించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వేతనాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వారు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య, గోవింద్‌రెడ్డి, నరేష్‌కుమార్, నాగరాజు, సైదులు, గోవర్ధన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయానికి విరాళం

కనగల్ : దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి ఎన్ఆర్ఐ బాబా డ్రిల్లింగ్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ వందనపు శశికుమార్ ఆదివారం లక్ష రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా శశికుమార్ మాట్లాడుతూ కంపెనీ తరపున త్వరలో మరో మూడు లక్షల విరాళం ఇస్తామని ప్రకటించారు. అనంతరం రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బాబా డ్రిల్లింగ్ కంపెనీ జీఎం దేప కరుణాకర్ రెడ్డి, ఆలయ సీనియర్ అసిస్టెంట్లు జినుకుంట్ల చంద్రయ్యగౌడ్, చిలుకరాజు లింగయ్య, ఆలయ అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రావణ్ కుమారాచార్యులు, గాదె ఉమా మహేశ్వర్ రావు, జూనియర్ అసిస్టెంట్ లింగస్వామిలు పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని బంగారుగడ్డలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ మాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. చీరలు, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు సమర్పించారు. అదే విధంగా అమ్మవారి పారాయణం, విశేషమైన వివిధ రకాల మంగళహారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్–నాగలక్ష్మి దంపతులు, వాసవి క్లబ్ డిస్ట్రిక్ పీఆర్ఓ రాయపూడి భవాని–ఉమాశేఖర్, రీజినల్ చైర్ పర్సన్ వీరవెల్లి పద్మావతి, జోన్ చైర్ పర్సన్ రమాదేవి, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ తిరునగరు పద్మావతిలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి, వనిత, కుసుమ క్లబ్‌ల నిర్వాహకులు గుంటూరు అనిత, భోనగిరి లావణ్య, కొండూరు ఇందిరా, తల్లం పుష్పావతి, గుండా లక్ష్మి, వీరవెల్లి శ్రీదేవి, సుస్మిత తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో స్థానిక సాగర్‌రోడ్డులోని ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవిమాతాకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లలిత, విష్ణు, సహస్రనామాలు, గీతా పారాయణం, గాయత్రి యజ్ఞం తదితర వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు ఊరే జనార్దన్ ధనలక్ష్మీ, ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి ధనుంజయ్య, నర్సింహ్మా, బుచ్చిరాములు, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆత్మార్పణ కార్యక్రమంలో భాగంగా వేదపండితుల మంత్రోత్సవాల మధ్య మహా యజ్ఞాన్ని నిర్వహించారు. అదే విధంగా వివిధ భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు వెంపటి రుషికేశ్వర్ రావు, సుబ్బారావు, నరేష్‌కుమార్, రమేష్, హరేరావు, సీతరామయ్య పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్: వాసవీమాత ఆలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్



కొండమల్లేపల్లి : వాసవీమాత ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు



దేవరకొండ : పూజల్లో పాల్గొన్న మహిళలు



అడవిదేవులపల్లి : సామూహిక యజ్ఞం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం, అమ్మవారికి అభిషేకం, 108మంది మహిళలతో మహాయజ్ఞం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వర్లు, జంగయ్య, కొత్త సుబ్బారావు, మల్లయ్య, నీలా పాండరయ్య, నీలా భిక్షమయ్య పాల్గొన్నారు.

పిల్లల జాబిల్లి పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

మిర్యాలగూడ : పట్టణానికి చెందిన ప్రముఖ కార్టూనిస్టు, రచయిత వడ్డేపల్లి వెంకటేష్ రచించిన పిల్లల జాబిల్లి పుస్తకాన్ని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డేపల్లి వెంకటేష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే బాధ్యతాయుతమైన కార్టూన్స్‌ను, రచనలను చేయడం అభినందనీయమన్నారు. ఆయన రచనలు ఎంతో సమాజానికి ఎంతో సందేశాత్మకంగా ఉంటాయన్నారు. అదేవిధంగా పిల్లల జాబిల్లి పుస్తకం కూడా బాగుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

శ్రీ కోదండ రామాలయంలో ఎమ్మెల్యే పూజలు

మండలంలోని తుంగపాడు గ్రామంలోని శ్రీకోదండ రామాలయంలో నూతన ధ్వజస్తంభ మహోత్సవంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పిల్లల జాబిల్లి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్ఫూర్తితో ముందుకెళ్లాలి



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్ఫూర్తితో ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తార్కిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించి అంత్యోదయ భావనతో చిట్టచివర ఉన్న వ్యక్తి ఆధారంగా పరిపాలన నిర్ణయాలు ఉండాలని కోరిన వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తం రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అమిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు ఎస్‌కె బాషా, బీజేపీ నాయకులు కంచుకొమ్ముల వేణు, రవికుమార్, జానకిరాంరెడ్డి తదితరులున్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల సాంగటీస్ ఆర్ట్స్ అకాడమి, హన్మకొండలో నిర్వహించిన పద్మశ్రీ బ్రహ్మానందం పోర్ట్రెట్ ఛాలెంజ్ చిత్రకళా పోటీలో మిర్యాలగూడకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు చిత్రకారుడు యినుగుర్తి విజయ్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. విజయ్ డ్రాయింగ్ క్లాస్ విద్యార్థులు జూనియర్ విభాగంలో కె. లిఖిత, బి. ఉజ్వల, సీహెచ్ శృతికీర్తన, వి.నాగనందిని, కె. రీత్విక్‌రెడ్డిలు వేసిన చిత్రాలకు సర్టిఫికెట్స్ ఆఫ్ అప్రిషియేషన్స్ లభించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 332 చిత్రాలు పాల్గొన్నాయన్నారు. విజయ్ డ్రాయింగ్ స్కూల్ విద్యార్థులు వేసిన చిత్రాలను ఆ సంస్థ ప్రత్యేకంగా అభినందించిందన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

శ్రీకోదండ రామాలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : మండలంలోని తుంగపాడు గ్రామంలో కొలువైన శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ, శాగం ఆదిరెడ్డి, సజ్జల శ్రీనివాస్‌రెడ్డి, బారెడ్డి అశోక్‌రెడ్డి, తుమ్మల ఫణికుమార్, లక్ష్మయ్య, భరత్, లింగయ్య, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'చలో నల్లగొండ' ను విజయవంతం చేయాలి

పెద్దవూర : ఈ నెల 13న కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, సభ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్‌లతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, నాయకులు కడారి అంజయ్య, జటావత్ రవినాయక్, చెన్ను సుందర్‌రెడ్డి, కర్ణ బ్రహ్మారెడ్డి, అంతయ్య, సత్యనారాయణరెడ్డి, లింగయ్య, రవినాయక్, వెంకట్‌రెడ్డి, శంకర్, శశధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ ఈ నెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, సభ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్‌లతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ ట్రి కార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, మాజీ ఎంపీపీ అల్లిపెద్దిరాజు, బాబురావునాయక్, పిడిగం నాగయ్య, నాగేండ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పెద్దవూర : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

డిండి : కృష్ణా జలాల పరిరక్షణ పేరుతో ఈనెల 13న నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే 'చలో నల్లగొండ' సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజినేని వెంకటేశ్వరరావు, డిండి పట్టణ అధ్యక్షుడు గిరమోని శ్రీను ఆదివారం ఒక ప్రకటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణా పరివాహక ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్లాయనే అంశంపై కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయక పోవడంతోపాటు నల్లగొండ సభను జరుగకుండా చూస్తామనడం హాస్యాస్పదంగా ఉందని వారు ఎద్దేవా చేశారు.

ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పట్టించొద్దు

కొండమల్లేపల్లి : ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పక్కదారి పట్టించొద్దని, వారి సంక్షేమానికే ఖర్చు చేయాలని ఆలిండియా సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసైన్డ్ ల్యాండ్స్ పట్టాదారులకు పర్మినెంట్ పట్టాలు ఇచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించాలని, అదే విధంగా ఇటీవల ప్రవేశ పెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో దళితులకు గత ప్రభుత్వం కంటే తక్కువ నిధులు కేటాయించిందన్నారు. ఎస్సీ, బీసీ,మైనార్టీ సంక్షేమ హాస్టల్స్, గురుకుల విద్యార్థుల మెనూ కాస్మొటిక్స్ చార్జీల పెంపు గతంలో ప్రకటించినప్పటికీ నేటికీ అమలుకు నోచుకోలేదని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు.

'అంబేడ్కర్ యువజన సంఘంతో సంబంధం లేదు'

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండలో ఆదివారం నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘానికి తనకు ఎలాంటి సంబంధం లేదని పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వూర రామకృష్ణ(ఆర్‌కె) తెలిపారు. స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు తన ప్రమేయం లేకుండా మిర్యాలగూడ డివిజన్ కన్వీనర్‌గా నియమించడం సరైంది కాదన్నారు. 20 ఏళ్లుగా లేని నాయకత్వం ఇప్పుడు ఆకస్మికంగా మార్పులు ఏంటని ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ స్వార్థం కోసం తనకు తెలియకుండా కన్వీనర్‌గా నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఈ రోజు నుంచి తనకు ఆ సంఘానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

ఆదిత్య కేర్ ఆస్పత్రిలో ఉచిత వైద్యశిబిరం

హాలియా : స్థానిక ఆదిత్య కేర్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండెపోటుకు గురైన వ్యక్తులకు సీపీఆర్ టెస్టు చేయడం విధానంపై డాక్టర్ల బృందం రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సులక రవీందర్‌రెడ్డి, ఎం గంగాధర్, మామిడాల వినయ్, గౌతంరెడ్డి, శశాంక్, సంతు, రాఘవేందర్‌రెడ్డి, హర్ష, సూరి, శ్రీనివాసరావు, సిబ్బంది రిక్కల ధనంజయ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

హాలియా : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాకార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కార్మిక సంఘం నాయకులతో కలిసి సమ్మె కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నరేంద్రమోదీ అధికారంలోకి రాకముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అక్రమ ధనాన్ని వెలికి తీసి ఇంటికో రూ. 15 లక్షలు పంచుతామని వాగ్దానాలు చేసి వాటిని పూర్తిగా విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్‌కె బషీర్, పాదిల వెంకన్న, వెంకటేశ్వర్లు, సైదులు, సురేష్, వెంకటయ్య, యాదయ్య, సైదిరెడ్డి, శ్రీను, సహదేవుడు, వెంకన్న పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా కత్తుల జగన్ కుమార్



జగన్‌కు నియామక పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు కత్తుల మల్లేశం

నల్లగొండటౌన్: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా కత్తుల జగన్‌కుమార్ నియమితులయ్యారు. ఆదివారం స్థానికంగా జరిగిన ఉమ్మడి జిల్లా సంక్షేమ సంఘం సమావేశంలో జగన్‌కుమార్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల మల్లేశం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కత్తుల మల్లేశం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ సంఘం పట్టణ, మండల, డివిజన్ స్థాయి కమిటీలను రద్దు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కత్తుల మహేష్, కత్తుల యాదయ్య, గడ్డం సహదేవ్, కత్తుల సూర్యనారాయణ, కాశయ్య, కొండేటి వెంకట్, దాసరి వెంకట్, కత్తుల యాదగిరి, మాతంగి లింగస్వామి, సన్ని పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

డిండి : మండల కేంద్రానికి చెందిన సింగజోగి ముత్తమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. డిండి యువత చేయూత ఆధ్వర్యంలో రూ. 10వేలు ఆర్థిక సాయంగా మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, దినేష్, శైలేష్, ఖయ్యూం, రమేష్, లక్ష్మణ్, పోశాలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాల 1993–94 పదో బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఎస్పీ కన్వెన్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఆనాటి మధురస్మృతులను గుర్తు చేసుకుని ఒకరికొకరు ఏఏస్థాయిలో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆర్థికంగా ఉన్నవారు స్నేహితులు ఇబ్బందుల్లో ఉన్న మిత్రులను ఆదుకోవాలని తీర్మానం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుర్గారెడ్డి, మహమూద్‌అలీ, వెంకటేశ్వర్లు, అబ్బాస్, శివ, అజీజ్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

హాలియా ఎస్ఐగా సతీశ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



హాలియా : హాలియా ఎస్ఐగా డి సతీష్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో హాలియా ఎస్ఐగా పని చేసిన శోభన్‌బాబు బదిలీపై దేవరకొండకు వెళ్లగా ఆయన స్థానంలో వీఆర్ నల్లగొండలో ఉన్న సతీష్‌రెడ్డి బదిలీపై హాలియా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమంగా సేవలు అందిస్తానని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

నేరెడుగొమ్ము ఎస్ఐగా సతీశ్



చందంపేట : నేరెడుగొమ్ము నూతన ఎస్ఐగా కె.సతీష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజు డిండికి బదిలీపై వెళ్లడంతో దేవరకొండలో పనిచేస్తున్న సతీష్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రలను పరిరక్షించడంలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

డిండి ఎస్ఐగా రాజు



డిండి : డిండి మండల ఎస్ఐగా బి.రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన డేరంగుల సైదులు దేవరకొండ ఎస్ఐ–2గా బదిలీపై వెళ్లడంతో నేరెడుగొమ్ము ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రజలందరూ సహకరించాలన్నారు.

మంత్రి కోమటిరెడ్డికి సెర్ప్ ఉద్యోగుల వినతి

నల్లగొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సెర్ప్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి నర్సయ్య, మోహన్‌రెడ్డి, వి. యాదయ్య, నరహరి, భాషపాక చంద్రశేఖర్, మైశేశ్వరరావు, బి.శ్రీనివాస్, వినోద పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నల్లగొండటౌన్: ఐఎన్‌టీయూసీ క్యాలెండర్, డైరీని ఆదివారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఆరోగ్య శాఖలో ఉద్యోగులకు వ్యతిరేకంగా జారీ చేసిన జీవో 142 రద్దు చేయాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మొగరాల శ్రీనివాస్, పాశం గోవింద్‌రెడ్డి, పాపాయిగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, శ్రవణ్, జ్ఞానేశ్వర్, భూషణ్, బైరబోయిన భిక్షం, నరసింహచారి, అంజయ్యగౌడ్, అన్నమ్మ, రామలక్ష్మి, మధుసూదన్, జమాలుద్దీన్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

నిలువెత్తు నిర్లక్ష్యం!

- ట్రాన్స్‌ఫార్మరు చుట్టూ మొక్కలు, తీగలు
- రిపేరుకు వచ్చిన ఏబీ స్విచ్

నిడమనూరు : మండలంలోని శాఖపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ మొక్కలు, పైన మెయిన్ వైర్ల వరకు తీగలు చుట్టుకుని ఉన్నాయి. అవసరం వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేయాలన్నా గ్రామస్తులు భయపడాల్సి వస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్‌కూడా రిపేరుకు వచ్చి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకున్న వారే లేకుండా పోయారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విద్యుత్ లేన్ రిపేరు చేయాలన్నా, ఇంటి సర్వీస్ వైర్ మార్చాలన్నా నిడమనూరు ప్రధాన కార్యాలయం నుంచి ఎల్సీ తీసుకుని పనులు చేయాల్సి వస్తుంది. ఏబీ స్విచ్ సక్రమంగా ఉంటే ట్రాన్స్‌ఫార్మర్ వద్దే విద్యుత్ సరఫరా నిలిపివేసుకుని పనులు చేసుకునే వీలుండేది. ప్రతి చిన్న పనికి ఎల్‌సీ తీసుకుని చేయాలంటే సమయం పట్టడంతో పాటు, ప్రమాదం జరిగినప్పుడు అత్యవసరంగా విద్యుత్ సరఫరా నిలిపివేయాలన్నా కష్టంగా ఉంటుంది. ఏబీ స్విచ్ సక్రమంగా లేకపోవడం వల్ల మెయి లైన్ నుంచి విద్యుత్ సరఫరా కావడానికి, నిలిపి వేయడానికి ఉపయోగపడే చోట పత్తీలు మధ్య మెరుపులు, మంటలు వస్తున్నాయి. రోడ్డు వెంటనే ఉండడం వల్ల గ్రామస్తులు బిక్కు,బిక్కుమంటూ అక్కడినుంచి వెళ్లాల్సి వస్తుంది



శాఖాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కమ్మేసిన మొక్కలు, తీగలు

సమస్య పరిష్కారానికి కృషి

ఏబీ స్వీచ్ చాలా రోజు క్రితమే రిపేర్‌కు వచ్చింది. గ్రామ పంచాయతీ నిధులు ఇస్తుందని చూసినా ఇవ్వలేదు. ఈలోగా ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. అలాగే మొక్కలు, తీగలు తొలగిస్తాం. ఏఈతో మాట్లాడి సమస్య పరిష్కరానికి కృషి చేస్తా.

– రహీం, లైన్‌మెన్,శాఖపురం